

రాయలసీమ దరువు

APTEL/26/A7874

www.rayalaseemadaruvu.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు'

తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.

చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్నశైలిలో వార్తలు రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి

94940 39030
85010 70080

ప్రచురణ : శ్రీ సత్యసాయి /అనంతపురం | ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప | మంగళవారం 13 అక్టోబర్ 2026 | సంపుటి : 01, సంచిక : 23 | పేజీలు : 04, వెల రూ.2

విజయవాడలో దసరా ఉత్సవాలు.. భద్రతను సమీక్షించిన హోం మంత్రి



విజయవాడలో ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో శరన్నవరాత్రుల ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి.

ఈ నవరాత్రుల్లో దుర్గమ్మవారిని దర్శించుకునేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తుతున్నారు.

విజయవాడ, అక్టోబర్12: నగరంలో ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో శరన్నవరాత్రుల ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నవరాత్రుల్లో దుర్గమ్మవారిని దర్శించుకునేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తుతున్నారు. మిగతా..2లో

పొన్నం ప్రభాకర్ సవాల్ కు రాంచందర్ రావు స్పందన




ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం

ఓట్లు కోల్పోయిన వారిని ఆధారాలతో సహా మీ ముందుకే తెస్తానన్న పొన్నం

ప్రధాన్ మంత్రి ఫసల్ జిమా యోజనను అమలు చేయాలని రాంచందర్ రావు డిమాండ్

హైదరాబాద్: తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య రాజకీయ వేడి రాజుకుంది. ఓటర్ల జాబితా సవరణలో పేర్ల తొలగింపు అంశంపై ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. ఈ క్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ సవాల్ విసిరారు. ఓటర్ల జాబితాల సవరణపై బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఓట్ల తొలగింపుపై రాంచందర్ రావు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "రాంచందర్ రావు తేదీ, సమయం ప్రకటిస్తే.. ఓటు హక్కు కోల్పోయిన వారిని ఆధారాలతో సహా ఆయన ముందుకే తీసుకొస్తాను" అని పొన్నం స్పష్టం చేశారు. మిగతా..2లో

కాకినాడ సీఐఐ సదస్సులో రూ.4,256 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు



- కాకినాడ సీఐఐ సదస్సులో రూ.4,256 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని మంత్రి లోకేశ్ తెలిపారు.
- ఈ పెట్టుబడులతో 14 వేల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు.

అమరావతి కాకినాడ కేంద్రంగా గోదావరి జిల్లాల్లో పెట్టుబడుల జోరు పెంచేలా సీఐఐ ప్రాంతీయ సదస్సులో రూ.4,256 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని

వెంకటాద్రి యాప్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- తిరుమల భక్తుల కోసం 'వెంకటాద్రి' నావిగేషన్ యాప్ ప్రారంభం
- రూ.3,222 కోట్లతో తిరుపతిలో భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం
- అలిపిరి వద్ద యాత్రికుల కోసం సమీకృత టౌన్‌షిప్‌కు శంకుస్థాపన
- మాస్టర్ ప్లాన్ రహదారులు, టీటీడీ ఉద్యోగుల లేఔట్ పనుల ప్రారంభం
- తిరుపతిని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం



అమరావతి : తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఓ శుభవార్త అందించింది. కొండపైకి వచ్చే యాత్రికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా క్యూలైన్లు, వసతి గదులు, అన్నప్రసాద కేంద్రాలు వంటి ముఖ్యమైన ప్రదేశాలను సులభంగా చేరుకునేందుకు 'వెంకటాద్రి' పేరుతో ఒక నూతన నావిగేషన్ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఈ యాప్‌ను ఆవిష్కరించారు. ఈ యాప్ ప్రత్యేకత ఏమిటంటే, కొండపై ఇంటర్నెట్ సిగ్నల్ లేకపోయినా ఆఫ్‌లైన్, జీపీఎస్ విధానంలో పనిచేస్తుంది. తెలుగుతో సహా ఐదు భాషల్లో అందుబాటులో ఉన్న ఈ యాప్‌లో, భక్తులకు మార్గనిర్దేశం చేసేందుకు ఏఐ ఆధారిత 'గోవింద' వాయిస్ అసిస్టెంట్ సదుపాయం కూడా ఉంది. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సిబ్బంది లొకేషన్‌ను ట్రాక్ చేసే సౌకర్యం కల్పించారు. ఆపిల్ యాప్ స్టోర్, గూగుల్ ప్లే స్టోర్ల నుంచి దీనిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఈ వెంకటాద్రి యాప్‌ను ఆవిష్కరించిన సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి సమగ్రాభివృద్ధికి ఉద్దేశించిన మరిన్ని కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడా), టీటీడీ సంయుక్తంగా చేపట్టనున్న రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులను సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన తిరుపతిని ఒక ఆదర్శ ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

పవన్ కల్యాణ్ తొలి సినిమాకు 30 ఏళ్లు.. అల్లు అరవింద్ స్పెషల్ నోట్

- సినీ రంగంలో 30 ఏళ్లు పూర్తి చేసుకున్న పవన్ కల్యాణ్‌కు అల్లు అరవింద్ అభినందనలు
- మన మొదటి సినిమా విడుదలై 30 ఏళ్లు గడిచాయంటే ఆశ్చర్యంగా ఉందన్న అరవింద్
- పవన్ సినీ ప్రయాణం ఒక అద్భుతమైన ప్రస్థానమని కొనియాడిన ప్రముఖ నిర్మాత
- సినిమాలకు అతీతంగా సమాజం పట్ల పవన్‌కున్న విస్తృత దృష్టిని ప్రత్యేకంగా ప్రశంసించిన అరవింద్



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సినీ పరిశ్రమలో 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రత్యేక లేఖను విడుదల చేశారు. పవన్ కల్యాణ్ సినీ ప్రస్థానం, ఆయన సామాజిక దృక్పథాన్ని ప్రశంసిస్తూ రాసిన ఈ లేఖ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. "ప్రియమైన శ్రీ పవన్ కల్యాణ్ గారికి, మన ఇద్దరి కలయికలో వచ్చిన మొదటి సినిమా విడుదలై 30 సంవత్సరాలు పూర్తయిందని తెలిసి ఆశ్చర్యానికి,

మోదీ సభలో '2029 విజయ్' ప్లకార్డులు



- మోదీ ప్రసంగంలో సీఎం విజయ్ పేరు ప్రస్తావించగానే సభలో ఉన్న విజయ్ అభిమానులు
- అధికారంలో ఉన్న బీజేపీ నాయకులు మరియు మద్దతుదారులు ఈ ఘటనపై ఏ విధంగా స్పందిస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పాల్గొన్న చెన్నై బహిరంగ

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని మోదీ కాపాడుతున్నారు

- ప్రధాని నరేంద్ర మోదీ, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ లక్ష్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు.
- జ్ఞానేశ్‌ను మోదీ కాపాడుతున్నారని విమర్శించారు.



ఢిల్లీ : భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని నరేంద్ర మోదీ కాపాడుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. సుప్రీంకోర్టు వరకు ఇండియా కూటమి చేపట్టే పాదయాత్ర ఈ విషయాన్ని దేశం ముందు ఉంచుతుందని అన్నారు. ఓట్ల చోరీ ఆరోపణలు, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసన గత నాలుగైదు రోజులుగా దిల్లీలో ఒక ప్రజా ఉద్యమంగా మారిందని తెలిపారు. గత 10-13 ఏళ్లుగా జరుగుతున్న ఈ ప్రతిఘటన, ఇప్పుడు ఒక పెద్ద ఉద్యమంగా మారుతోందన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కన్నాట్ ప్లేస్ నుంచి సుప్రీంకోర్టు వరకు ఇండియా బ్లాక్ పాదయాత్ర చేపట్టే ముందు దేశ రాజధాని దిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మిగతా..2లో

కనకదుర్గమ్మను దర్శించుకోనున్న రాష్ట్రపతి ముర్ము

మహిళలు, లఖ్‌పతి దీదీలతో విందు

- ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల్లో మహాచండీ దేవి అలంకరణ రోజున రాష్ట్రపతి ముర్ము అమ్మవారిని దర్శించుకోనున్నారు.
- ఈ క్రమంలో రాష్ట్రపతి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు.



ఢిల్లీ : విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో మహాచండీ దేవి అలంకరణ రోజున రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఈ నెల 14వ తేదీన రాత్రి 7 గంటల 20 నిమిషాలకు ముర్ము ఆలయానికి చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి భద్రతా ఏర్పాట్లను ఆలయ అధికారులు పకడ్బందీగా చేపడుతున్నారు. ఇందులో భాగంగా కమిషనర్ రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో చీఫ్ ఫెస్టివల్ అధికారి త్రినాధరావు పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈఓ శీనానాయక్ పండితులతో సమావేశమయ్యారు. డీసీపీ కేజీవీ సరిత పర్యవేక్షణలో మిగతా..2లో

ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్‌పై తెలంగాణ ప్రభుత్వం పునరాలోచన.. చార్జీల తగ్గింపుకు కసరత్తు



- ఆర్టీసీ-మెట్రో పాస్ చార్జీలపై సమీక్ష
- త్వరలో కొత్త ధరలు ప్రకటిస్తామన్న మంత్రి పొన్నం
- ధరలు భారంగా ఉన్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు

హైదరాబాద్: హైదరాబాద్‌లో ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ చార్జీలపై తెలంగాణ ప్రభుత్వం పునఃసమీక్ష చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత ధరలు సామాన్యులకు భారంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రస్తుతం రోజువారీ కామన్ పాస్‌కు రూ. 400 (మెట్రోకు రూ. 300, ఆర్టీసీకి రూ. 100), నెలవారీ పాస్‌కు రూ. 8,500 (మెట్రోకు రూ. 7,000, ఆర్టీసీకి రూ. 1,500) చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ ధరల నిర్ణయంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన సూచన మేరకు,

ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు

కేంద్రంపై రేవంత్ రెడ్డి ఫైర్

- కేంద్ర ప్రభుత్వం ఈసీని దుర్వినియోగం చేస్తోందన్న సీఎం రేవంత్
- ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పేరుతో బీజేపీ వ్యతిరేకుల ఓట్ల తొలగిస్తున్నారని ఆరోపణ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు సరిపోవన్నట్లుగా ఇప్పుడు మోదీ సర్కార్ ఎన్నికల కమిషన్‌ను (ఈసీ) కూడా దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. మిగతా..2లో

ప్రజల దాహం కంటే బీర్లే ముఖ్యమా? ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్



- సింగూరు ప్రాజెక్టు నీటిని మళ్లిస్తున్నారని హరీశ్ రావు ఆరోపణ
- రాష్ట్రంలో కరెంట్ కోతలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమన్న మాజీ మంత్రి
- కోట్ల మంది తాగునీటి అవసరాలను పట్టించుకోవడం లేదని విమర్శ

హైదరాబాద్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలను పక్కనపెట్టి, బీర్ ఫ్యాక్టరీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... ప్రభుత్వం నీటి, విద్యుత్ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. సింగూరు ప్రాజెక్టు అంశాన్ని హరీశ్ రావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. మరమ్మతుల పేరుతో ప్రాజెక్టు నుంచి 29 టీఎంసీల మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

కాకినాడ సీఐఐ సదస్సులో రూ.4,256 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు

మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఈ పెట్టుబడులతో 14 వేల మందికిపైగా ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందని తెలిపారు. బ్లూ ఎకానమీ, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధిలో గోదావరి జిల్లాలు కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉన్నాయని లోకేశ్ స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలోని పెట్టుబడి అవకాశాలను పారిశ్రామికవేత్తలకు పరిచయం చేయడమే లక్ష్యంగా కాకినాడలో ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని చెబుతూ వేగవంతమైన నిర్ణయాలు, పారిశ్రామిక అభివృద్ధికి ఏపీని ఎంచుకోవాలని పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన వీడియోను మంత్రి లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

విజయవాడలో దసరా ఉత్సవాలు.. భద్రతను సమీక్షించిన హోం మంత్రి

విజయవాడ వేదికగా ఈ దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0తోపాటు జాతీయ సరస్ మేళా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులతో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా విజయవాడ మోడల్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను హోం మంత్రి సందర్శించారు. ఈ కంట్రోల్ రూమ్ పనితీరును మంత్రికి వారు వివరించారు. భక్తుల భద్రతకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 30 అధునాతన డ్యాష్ బోర్డుల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే భక్తుల రద్దీని పర్యవేక్షించేందుకు ఏఐ కెమెరాలు, డ్రోన్లు, ఏఎన్‌పీఆర్ సాంకేతికతను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. దేవాలయంలో క్యూ లైన్లు, పార్కింగ్ ప్రదేశాలు, ఆర్టీసీ, రైల్వే ప్రయాణికుల రద్దీపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు వివరించారు. భక్తుల సౌకర్యార్థం నగరంలో 40 పార్కింగ్ పాయింట్లు ఏర్పాటు చేశామని మంత్రి అనితకు పోలీస్ అధికారులు తెలిపారు. ఈ సమీక్షలో డీసీపీలు షరీన్ బేగం, కేజీవీ సరిత, కృష్ణ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు

ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అడ్డం పెట్టుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లను తొలగించే బాధ్యతను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు అప్పగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 1950లో ప్రజలకు ఓటు హక్కు కల్పించడానికి తీసుకొచ్చిన ఈ ప్రక్రియను, ఇప్పుడు బీజేపీ తన వ్యతిరేకుల ఓట్లను తొలగించడానికి వాడుకుంటోందని విమర్శించారు. ఈ చర్యల ద్వారా.. బీజేపీని వ్యతిరేకించే యువత, నిరుద్యోగులు, పేదలను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఈసీలోని మిగతా ఇద్దరు కమిషనర్లు ఎస్ఐఆర్ ప్రక్రియలోని లోపాలను వ్యతిరేకించారని, దీనివల్ల జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు బయటపడ్డాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అలాంటి అధికారిని తొలగించడానికి ప్రధాని నరేంద్ర మోదీకి అభ్యంతరం ఎందుకని ఆయన ప్రశ్నించారు. బీజేపీ మత, ప్రాంతీయ ప్రాతిపదికన ప్రజలను విభజించి, ధనవంతులు-బీజేపీ మద్దతుదారులు ఒకవైపు, పేదలు-గిరిజనులు-బీజేపీ వ్యతిరేకులు మరోవైపు అనేలా రెండు వర్గాలుగా చూస్తోందని ఆరోపించారు. ఈ పరిస్థితిని మరో స్వాతంత్ర్య సంగ్రామంగా అభివర్ణించిన రేవంత్, రాహుల్ గాంధీ చేపట్టిన 'జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్' ఉద్యమం దేశాన్ని కాపాడుతుందని అన్నారు. గతంలో జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని రాహుల్ గాంధీ వ్యతిరేకించిన విషయాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

ప్రజల దాహం కంటే బీర్లే ముఖ్యమా? ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

నీటిని ఖాళీ చేసి, పనులను అసంపూర్తిగా వదిలేశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 3 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నా, దానిని బీర్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ చర్య వల్ల హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రజల తాగునీటి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యాల వల్లే రాష్ట్రంలో కరెంట్ కోతలు పెరిగాయని, ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని హరీశ్ రావు అన్నారు. ఎల్ నినో ప్రభావంపై ముందుగానే హెచ్చరికలు ఉన్నప్పటికీ, దేవాదుల, కల్వకుర్తి వద్ద నీటిని లిఫ్ట్ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, ఇది కృత్రిమ కరవుకు దారితీసిందని దుయ్యబట్టారు. మద్యం కంపెనీలకు నీటి కొరత రాకూడదని ఎక్సైజ్ మంత్రి వ్యాఖ్యానించడాన్ని ఆయన తప్పుపట్టారు.

ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్‌పై తెలంగాణ ప్రభుత్వం పునరాలోచన.. చార్జీల తగ్గింపుకు కసరత్తు

ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని చార్జీలను పునఃపరిశీలించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేయడమేనని, ప్రజలపై అదనపు భారం మోపడం తమ లక్ష్యం కాదని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రయాణికుల అవసరాలు, ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, త్వరలోనే ఉన్నతాధికారులతో సమావేశమై అందరికీ అందుబాటులో ఉండేలా ధరలపై సరైన నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. ఈ పథకం ద్వారా ప్రయాణికులకు మేలు చేకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు.

మోదీ సభలో '2029 విజయ్' ప్లకార్డులు

సభలో ఊహించని దృశ్యాలు చోటుచేసుకున్నాయి. ప్రధాని మోదీ ప్రసంగిస్తున్న సమయంలో తమిళగ వెట్రి కజగం పార్టీకి చెందిన మద్దతుదారులు '2029 పీఎం విజయ్', 'ఇండియా ఫ్యూచర్ విజయ్' అంటూ రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ ఈలలతో హంగామా చేశారు. మోదీ ప్రసంగంలో సీఎం విజయ్ పేరు ప్రస్తావించగానే సభలో ఉన్న విజయ్ అభిమానులు ఒక్కసారిగా ఉత్సాహంతో ఈ ప్లకార్డులను నినాదాలతో హోరెత్తించారు. ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ కావడంతో జాతీయ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది.

బీజేపీ వర్గాల్లో ఉత్కంఠ భవిష్యత్తు తమిళనాడు రాజకీయాలపై ప్రభావం

ప్రధాని వేదికపై ఉన్న సమయంలోనే విజయ్‌ను భావి భారత ప్రధానిగా అభివర్ణిస్తూ ఇలా ప్లకార్డులు పట్టుకోవడం తీవ్ర రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. పరిస్థితిని గమనించిన భద్రతా సిబ్బంది వెంటనే కలగజేసుకుని ప్లకార్డులను దించివేయించినప్పటికీ, విజయ్ మద్దతుదారులు కెమెరాల వైపు వాటిని చూపిస్తూ తమ మద్దతును తెలపడం విశేషం. అధికారంలో ఉన్న బీజేపీ నాయకులు మరియు మద్దతుదారులు ఈ ఘటనపై ఏ విధంగా స్పందిస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి తమిళనాడు రాజకీయ సమీకరణాలు మరియు టీవీకే వ్యూహాలు ఎలాంటి మలుపులు తిరుగుతాయోనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పొన్నం ప్రభాకర్ సవాల్ కు రాంచందర్ రావు స్పందన



ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సవరణ ప్రక్రియలో పొరపాట్లు జరిగితే సరిదిద్దాల్సింది పోయి, బీజేపీ నేతలు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. మంత్రి పొన్నం సవాల్‌పై స్పందించిన రాంచందర్ రావు... ఓట్లు తొలగించబడినట్టు చెబుతున్న ఒక 10 మందిని ఎన్నికల సంఘం కార్యాలయానికి తీసుకురావాలని ప్రతి సవాల్ విసిరారు. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని అమలు చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకం నుంచి వైదొలగగా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి ఫసల్ బీమా యోజనలో చేరాలని ఈ ఏడాది మార్చిలోనే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. మొత్తంమీద, ఈ సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

కనకదుర్గమ్మను దర్శించుకోనున్న రాష్ట్రపతి ముర్ము - మహిళలు, లఖ్‌పతి దీదీలతో విందు

మొదటి పేజి తరువాయి

రాష్ట్రపతి పర్యటన సన్నాహాలపై ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రోటోకాల్ తప్పకుండా పాటించాలి : రాష్ట్రపతి ముర్ము పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 14, 15 తేదీల్లో రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ప్రోటోకాల్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, నిమిషాల వారీగా నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పర్యటన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎస్ పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం గన్నవరం విమానాశ్రయానికి చేరుకోనున్న రాష్ట్రపతి రాత్రి ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకోనున్నారు. 15న పున్నమి ఘాట్‌లో



నిర్వహించే సరస్ మేళాలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలు, లఖ్‌పతి దీదీలతో కలిసి విందులో పాల్గొని మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయం నుంచి దిల్లీకి తిరుగు ప్రయాణమవుతారు. రాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సాయిప్రసాద్ ఆదేశించారు. తెల్లవారుజామునుంచే భారీగా భక్తుల తాకిడి : ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి దసరా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజు అమ్మవారు గాయత్రీదేవి ఆలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామునుంచే భక్తుల తాకిడి భారీగా ఉంది. క్యూలో నిల్చున్న భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకుంటున్నారు. గాయత్రీ దేవిని పంచముఖాలు కలిగిన రూపంలో పూజిస్తారు. ఆ రూపంలో అమ్మవారిని దర్శించుకుంటే సకల సౌభాగ్యాలూ కలుగుతాయని పండితులు తెలిపారు.

వెంకటాద్రి యాప్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

అలిపిరి వద్ద సమీకృత యాత్రికుల టౌన్‌షిప్

ఈ అభివృద్ధి పనుల్లో అత్యంత కీలకమైనది అలిపిరి వద్ద ఎస్వీ జూపార్క్ రహదారిలో నిర్మించతలపెట్టిన సమీకృత యాత్రికుల టౌన్‌షిప్. దీని నిర్మాణానికి సుమారు రూ.2,750 కోట్లు వెచ్చించనున్నారు. తిరుమల కొండపై వసతుల ఒత్తిడి తగ్గించి, తిరుపతిలోనే భక్తులకు అన్ని సౌకర్యాలు ఒకేచోట కల్పించడం ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో పది అంతస్తుల చొప్పున నాలుగు బ్లాకుల్లో 2,700 గదులను నిర్మించనున్నారు. దీని ద్వారా రోజుకు దాదాపు 16 వేల మందికి వసతి అందుబాటులోకి వస్తుంది. రూ.160 కోట్లతో నిర్మించే అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భోజనం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ సమస్య పరిష్కారానికి రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపేలా బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయాన్ని, రూ.90 కోట్లతో సమీకృత రవాణా టెర్మినల్‌ను నిర్మించనున్నారు.

మౌలిక సదుపాయాల విస్తరణ

తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.242 కోట్ల వ్యయంతో 20 కిలోమీటర్ల పొడవున తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. ఈ రహదారులు జాతీయ రహదారుల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరచడంతో పాటు, తిరుచానూరు అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటాయి.శ్రీవారి సేవలో నిరంతరం పనిచేసే టీటీడీ ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని సీఎం తెలిపారు. ఇందులో భాగంగా 418 ఎకరాల్లో 5,192 మంది ఉద్యోగులకు ఇళ్ల స్థలాల లేఔట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ లేఔట్లలో అంతర్గత రహదారులు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనకు రూ.230 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఉద్యోగుల కుటుంబాలు సంతోషంగా ఉంటే, వారు మరింత అంకితభావంతో భక్తులకు సేవలందిస్తారని సీఎం అన్నారు.

సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

తిరుమల తరహా పవిత్రతను తిరుపతిలోనూ తీసుకురావాలని సీఎం అధికారులను ఆదేశించారు. తిరుపతిని కేవలం యాత్రా కేంద్రంగా కాకుండా ఆధ్యాత్మికత, పర్యావరణం, సాంకేతికత, విద్య,



ఉపాధి, పర్యాటకంగా సమన్వయంతో అభివృద్ధి చేయాలన్నారు. నగరంలోని చెరువులను అనుసంధానించి సుందరీకరించాలని, 'వృక్షో గోవింద' కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయాలని సూచించారు. మెరుగైన మౌలిక సదుపాయాలతో తిరుపతిని వివాహ వేడుకలకు, జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు కేంద్రంగా మార్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం.రవిచంద్ర, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, తిరుపతి జిల్లా కలెక్టర్, తుడా అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని మోదీ కాపాడుతున్నారు

మొదటి పేజి తరువాయి

విలేకరుల సమావేశంలో రాహుల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. 'కేంద్ర ప్రభుత్వం పెద్ద తప్పు చేస్తోంది. ఎందుకంటే కేంద్రం, ప్రధాని మోదీ కలిసి సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడుతున్నారు. జ్ఞానేశ్ నేతృత్వంలోని ఈసీకి, ఓట్ల చోరీకి వ్యతిరేకంగా 'చలో దిల్లీ' చేపడతాం. అసలు దిల్లీని ఎందుకు జైల్లో పెట్టారు?. భారత ప్రజాస్వామ్యం, ఎన్నికల నిష్పక్షపాతాన్ని హత్య చేయడంపై మేము తీవ్ర ఆందోళనతో సీజేఐకి లేఖ రాశాం. సీజేఐ అందుకు స్పందించి పిటిషన్ దాఖలు చేయమని ఆదేశించారు. ఈరోజు ఇండియా బ్లాక్ నాయకులు, నేను కలిసి సుప్రీంకోర్టుకు వెళ్లి జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు చేస్తాం. ఓటు చోరీకి సీఈసీ జ్ఞానేశ్ సహకరిస్తున్నారు. తమ ఆందోళనకు ప్రజలు మద్దతు ఇస్తున్నారు. కచ్చితంగా 50 శాతం మంది పోలీసు సిబ్బంది మాకు మద్దతుగా నిలుస్తున్నారు. మేము



చేస్తున్న పని సరైనదేనని, దీన్ని కొనసాగించాలని చెబుతున్నారు. ఒకవైపు పోలీసులు, , భారత ప్రజలు ఉంటే, మరోవైపు నరేంద్ర మోదీ, అమిత్ షా, అజిత్ ధోబల్, జ్ఞానేశ్ కుమార్ ఉన్నారు."

రాహుల్ గాంధీ, లోక్‌సభలో విపక్ష నాయకుడు

దిల్లీని కోటలా మార్చేశారు : రాహుల్ గాంధీ

దేశ రాజధాని దిల్లీలో విధించిన ఆంక్షలపైనా రాహుల్ ప్రశ్నలు లేవనెత్తారు. ప్రజలు దిల్లీకి చేరుకోకుండా అడ్డుకుంటున్నారని, నగరాన్ని ఒక కోటలా మార్చేశారని ఆరోపించారు. దేశ రాజధాని నగరమైన దిల్లీ ఎందుకు దిగ్బంధనంలో ఉంది? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలకు సంబంధించి ఆధారాలు చూపాలని భారత రాష్ట్రపతి ప్రతిపక్షాన్ని కోరారని అన్నారు. అయితే ఆ తర్వాత వచ్చిన తిరస్కరణ రాష్ట్రపతి భవన్ నుంచి కాకుండా ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ) నుంచి వచ్చిందని విమర్శించారు. దేశ రాజ్యాంగాన్ని యువత పవిత్రమైన గొంతుకగా అభివర్ణించారు. అలాగే పోలీసుల ఏర్పాటు చేసిన బారికేడ్లు, అణచివేత చర్యలను ఎదుర్కొనే విషయంలో ప్రజలు పట్టుదల ప్రదర్శించాలని కోరారు.

పవన్ కల్యాణ్ తొలి సినిమాకు 30 ఏళ్లు.. అల్లు అరవింద్ స్పెషల్ నోట్

మొదటి పేజి తరువాయి

దాదాపు షాక్‌కు గురయ్యాను. ఈ పరిశ్రమలో మీరు అద్భుతమైన ప్రయాణాన్ని సాగించారు. 30 ఏళ్లు పూర్తి చేసుకున్న మీకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని అల్లు అరవింద్ తన లేఖలో పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ భవిష్యత్తును ఉద్దేశిస్తూ, "మీరు ఎంచుకున్న మార్గంలో మరిన్ని సంవత్సరాలు విజయం సాధించి, సంతృప్తికరమైన జీవితం గడపాలని నేను ఆకాంక్షిస్తున్నాను. అన్నింటికంటే ముఖ్యంగా, సినిమాలకు అతీతంగా సమాజం పట్ల మీకున్న విస్తృత దృష్టిని, మీరు చేస్తున్న సేవను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను" అని కొనియాడారు. చివరగా, "డియర్ కల్యాణ్, మరోసారి అభినందనలు. నా శుభాకాంక్షలు, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి" అని అల్లు అరవింద్ తన లేఖను ముగించారు. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా పరిచయమైన "అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి" చిత్రానికి అల్లు అరవింద్ నిర్మాతగా వ్యవహరించిన విషయం తెలిసిందే. మూడు దశాబ్దాల క్రితం ప్రారంభమైన వారి ప్రొఫెషనల్ బంధాన్ని గుర్తుచేసుకుంటూ, నేడు పవన్ కల్యాణ్ ఒక నటుడిగానే కాకుండా ఉప ముఖ్యమంత్రిగా ప్రజాసేవలో ఉన్న తరుణంలో అల్లు అరవింద్ ఈ లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది. పవన్ కల్యాణ్, సుప్రియ యార్లగడ్డ జంటగా ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో వచ్చిన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రం 1996 అక్టోబరు 11న ప్రేక్షకుల ముందుకు



వచ్చింది. ఈ తొలి చిత్రంలో పవన్ నటనకు మంచి మార్కులే పడ్డాయి.

'కొత్త ఫారం-6ను సుప్రీంకోర్టు ఆమోదించలేదు'.. ఈసీ ప్రకటనపై సీజేఐ ఆగ్రహం

బిహార్ సర్ అంశం విచారణలో కొత్త ఫామ్-6ను ఆమోదించామన్న వాదనపై తీర్పు ఇవ్వలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బిహార్ ఎస్ఐఆర్ విచారణలో కొత్త ఫామ్-6 అంశమే రాలేదన్న తెలిపింది.

ఢిల్లీ : బిహార్ ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐఆర్)కు అంశంలో కొత్త ఫామ్ -6పై ఎలాంటి తీర్పు ఇవ్వలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తీర్పు వెలువరించినప్పుడు కొత్త ఫారం-6 అంశమే లేదని తెలిపింది. వివిధ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఉపయోగిస్తున్న ఫామ్-6లో చేసిన మార్పులను అత్యున్నత న్యాయస్థానం ఆమోదించిందన్న ఈసీ చేసిన ప్రకటనపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దరఖాస్తులో మార్పులు ఎవరు చేశారో రికార్డులు పరిశీలించి తేలుస్తామని పేర్కొంది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం సోమవారం బిహార్ ఎస్ఐఆర్‌కు సంబంధించిన పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఫామ్-6కు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందని ఎన్నికల సంఘం పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో ఈసీ ఏకపక్ష నిర్ణయాలపై చర్యలకు ఆదేశించాలని కోరారు. దీనిపై స్పందించిన జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, కొత్త ఫామ్-6పై ఎలాంటి న్యాయ నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. బిహార్ ఎస్ఐఆర్ వ్యవహారంపై గతంలో విచారణ జరిపినప్పుడు కొత్త ఫామ్-6 అంశం తమ ముందుకు రాలేదని ఆయన పేర్కొన్నారు. బిహార్ ఎస్ఐఆర్ అంశంలో మేలో సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది. ఆ తీర్పులో ఫామ్-6ను ఎస్ఐఆర్ ధ్రువీకరణ ప్రక్రియకు మార్గదర్శకంగా పేర్కొంది. అప్పట్లో బిహార్‌లో ఉపయోగించిన ఫామ్ -6 పత్రాల పరిశీలనకు ఒక విధానాన్ని నిర్దేశిస్తోందని వివరించింది. ధ్రువీకరణ ప్రక్రియకు ఎలాంటి మార్గదర్శకాలు లేకుండా పూర్తిగా అధికారుల వ్యక్తిగత నిర్ణయాలపై వదిలేయడం ఆచరణ సాధ్యం కాదని, 1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనల ప్రకారం రూపొందించిన ఫామ్-6, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21(2) కింద చేపట్టే ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియకు అనుగుణంగా ఉండాలని ఆ తీర్పులో పేర్కొన్నారు.

ఎన్నికల సంఘం ప్రకటనపై చర్చ

2026 సెప్టెంబర్ 26న ఎన్నికల సంఘం ఒక ప్రకటనను విడుదల చేసింది. అందులో బిహార్ ఎస్ఐఆర్‌కు సంబంధించి 2026 మేలో ఇచ్చిన తీర్పులో ఫామ్ -6లోని ప్రకటనను సుప్రీంకోర్టు సమర్థించినట్లు పేర్కొంది. దాని ప్రకారం, కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వ్యక్తులు గతంలో నిర్వహించిన ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాలతో తమకు ఉన్న సంబంధాన్ని వివరించే అదనపు డిక్లరేషన్‌ను సమర్పించాల్సి వచ్చింది. దరఖాస్తుదారులు తాము, తమ తల్లిదండ్రులు



లేదా తాతముత్తాతలు గత ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాల్లో నమోదై ఉన్నారా? అనే వివరాలు వెల్లడించాలి. ఈ వివరాల ద్వారా పాత ఓటర్ల జాబితాలతో అనుసంధానాన్ని గుర్తించే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఫామ్-6కు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందని ఎన్నికల సంఘం పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో ఈసీ ఏకపక్ష నిర్ణయాలపై చర్యలకు ఆదేశించాలని కోరారు. దీనిపై స్పందించిన జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, కొత్త ఫామ్-6పై ఎలాంటి న్యాయ నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. బిహార్ ఎస్ఐఆర్ వ్యవహారంపై గతంలో విచారణ జరిపినప్పుడు కొత్త ఫామ్-6 అంశం తమ ముందుకు రాలేదని ఆయన పేర్కొన్నారు. బిహార్ ఎస్ఐఆర్ అంశంలో మేలో సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది. ఆ తీర్పులో ఫామ్-6ను ఎస్ఐఆర్ ధ్రువీకరణ ప్రక్రియకు మార్గదర్శకంగా పేర్కొంది. అప్పట్లో బిహార్‌లో ఉపయోగించిన ఫామ్ -6 పత్రాల పరిశీలనకు ఒక విధానాన్ని నిర్దేశిస్తోందని వివరించింది. ధ్రువీకరణ ప్రక్రియకు ఎలాంటి మార్గదర్శకాలు లేకుండా పూర్తిగా అధికారుల వ్యక్తిగత నిర్ణయాలపై వదిలేయడం ఆచరణ సాధ్యం కాదని, 1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనల ప్రకారం రూపొందించిన ఫామ్-6, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21(2) కింద చేపట్టే ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియకు అనుగుణంగా ఉండాలని ఆ తీర్పులో పేర్కొన్నారు.డం తప్పనిసరి చేశారు. ఈ ప్రక్రియను పూర్తి చేయకుండా ఫామ్-6 దరఖాస్తులను సమర్పించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ మార్పులపై పిటిషనర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై అక్టోబర్ 5న విచారణ సందర్భంగా కూడా ప్రధాన న్యాయమూర్తి ఈ అంశంపై స్పందించారు. వివిధ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం ఉపయోగిస్తున్న ఫామ్-6లో చేసిన మార్పులను తాము ఆమోదించలేదని తెలిపింది. ఫామ్-6 అనేది 1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనల షెడ్యూల్‌లో పొందుపరిచిన చట్టబద్ధమైన పత్రం. ఇందులో మార్పులు చేయాలంటే తగిన చట్టపరమైన ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుందని పిటిషన్‌లో వాదించారు. ఏకపక్షంగా పరిపాలనా నిర్ణయాల ద్వారా ఇటువంటి మార్పులు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

జనసేన సమన్వయకర్తగా మహేష్

పూతలపట్టు,అక్టోబర్12 (దరువు న్యూస్):పూతలపట్టు నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల అసెంబ్లీ సమన్వయకర్తగా ఎం. మహేష్ స్వేరోను జనసేన పార్టీ నియమించింది. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్‌తో పాటు పార్టీ నాయకులకు మహేష్ స్వేరో కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పూతలపట్టు నియోజకవర్గంలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని తెలిపారు.



బాలిక వైద్య పరీక్షలకు కలెక్టర్ ఆర్థిక సాయం



చిత్తూరు,అక్టోబర్ 12(దరువు న్యూస్):ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన వినతిపై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తక్షణమే స్పందించి ఓ నిరుపేద బాలికకు ఆర్థిక సహాయం అందించారు. బంగారుపాళ్యం మండలం సంక్రాంతిపల్లి, సత్రం పోస్టుకు చెందిన శిల్ప (10) వైద్య పరీక్షలు చేయించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కలెక్టర్‌కు వినతి సమర్పించారు. బాలిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ వైద్య పరీక్షల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. అవసరంలో ఉన్న వారికి ప్రభుత్వ పరంగా అండగా నిలవడంలో భాగంగా కలెక్టర్ తక్షణమే స్పందించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మధ్యవర్తిత్వంతో పెండింగ్ కేసుల పరిష్కారం



చిత్తూరు,అక్టోబర్ 12(దరువు న్యూస్):జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించేందుకు నేషనల్ మీడియేషన్ క్యాంపెయిన్ 3.0 కింద విస్తృత చర్యలు చేపట్టినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి భారతి తెలిపారు. సోమవారం మీడియా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, 2026 ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు జిల్లాలో 1,439 కేసులను గుర్తించి, 388 కేసులను మధ్యవర్తిత్వానికి పంపినట్లు వెల్లడించారు. వైవాహిక, కుటుంబ, ఆస్తి వివాదాలు, చెక్ బౌన్స్, రుణ వసూళ్లు తదితర కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా ఇరుపక్షాలు స్వచ్ఛందంగా చర్చించుకుని సామరస్యపూర్వక పరిష్కారం పొందవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ వివాదాల పరిష్కారానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని ఆమె సూచించారు.

నగరపాలక కార్యాలయంలో పీజీఆర్ఎస్



చిత్తూరు,అక్టోబర్ 12(దరువు న్యూస్):చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో కమిషనర్ పి. నరసింహ ప్రసాద్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులపై సంబంధిత అధికారులతో అక్కడికక్కడే చర్చించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీలపై వేగంగా క్షేత్రస్థాయి పరిశీలన జరిపి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ విభాగానికి రెండు, ఇంజినీరింగ్ విభాగానికి ఒకటి చొప్పున మొత్తం మూడు వినతులు అందాయి. ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్ కుమార్, ఏసీపీ అనిల్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

చిత్తూరు,అక్టోబర్ 12(దరువు న్యూస్):ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో



అలసత్వం వహించకుండా,ప్రతి ఫిర్యాదుపై చట్ట ప్రకారం విచారణ జరిపి నిర్దేశిత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో ఆయన మొత్తం 53 ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎస్పీతో పాటు అదనపు ఎస్పీలు మహబూబ్ బాషా, ఎస్.షాను,చిత్తూరు ఎస్డీపీఓ జె.వెంకటనారాయణకు విన్నవించారు. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎస్పీ సూచించారు. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. కుటుంబ తగాదాలు 12, చిన్న గొడవలు 10, డబ్బు తగాదాలు 9, భూ తగాదాలు 4, చీటింగ్ 3, ఇంటి తగాదాలు 3, పోలీసు సేవలు 3, బెదిరింపులు 3, వేధింపులు 2, ఆస్తి తగాదాలు 2, దారి సమస్యలు 2.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



చిత్తూరు,అక్టోబర్ 12(దరువు న్యూస్):ప్రజా సమస్యలను వేగంగా, పారదర్శకంగా, నిబంధనల మేరకు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్‌లో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడిన తర్వాతే నివేదిక సమర్పించాలని, మాట్లాడిన తేదీ, సమయాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. పెండింగ్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సరిహద్దు వివాదాలు, రికార్డుల్లో తప్పులు, విస్తీర్ణ వ్యత్యాసాలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ 1100 టోల్‌ఫ్రీ సేవ ద్వారా అందే ఫిర్యాదులపై కూడా బాధ్యతాయుతంగా స్పందించాలని, క్షేత్రస్థాయి అధికారులు పీజీఆర్ఎస్‌కు హాజరై ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 277 వినతులు అందాయి. వీటిలో 234 రెవెన్యూ, సర్వే శాఖకు సంబంధించినవి కాగా, ఇతర శాఖలకు సంబంధించి 43 వినతులు వచ్చాయి. పోలీసు శాఖ 3, పంచాయతీరాజ్ 5, డీఆర్‌డీఏ 9, గిరిజన సంక్షేమ శాఖ 1, మున్సిపల్ పరిపాలన 7, విద్యాశాఖ 1, ఐసీడీఎస్ 1, నీటిపారుదల శాఖ 2, ప్రొబేషన్ అండ్ ఎక్సైజ్ 1, మత్స్యశాఖ 1, పౌరసరఫరాల శాఖ 3, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 2, పశుసంవర్ధక శాఖ 5, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ 2 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసుల నాయుడు, పలమనేరు ఆర్డీవో భవాని, డిప్యూటీ కలెక్టర్లు పుల్లారెడ్డి, మధుసూదన్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షణపై అవగాహనకు ప్రాధాన్యం

చిత్తూరు,అక్టోబర్ 12(దరువు న్యూస్):ఆడపిల్లల సంరక్షణ, లింగ వివక్ష నిర్మూలనపై సమాజంలో అవగాహన పెంపొందించేందుకు షార్ట్ ఫిల్మ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్టంపై నిర్వహించిన షార్ట్ ఫిల్మ్ పోటీల విజేతలకు సోమవారం ఆయన బహుమతి చెక్కులు అందజేశారు. జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి మొత్తం 19 షార్ట్ ఫిల్మ్‌లు పోటీలకు వచ్చాయి. వీటిలో పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల నుంచి 14, నగరి కళాశాల నుంచి ఒకటి, సావిత్రమ్మ ప్రభుత్వ కళాశాల నుంచి నాలుగు చిత్రాలు ఉన్నాయి. వైద్య, ఆరోగ్యశాఖ, ఐసీడీఎన్, విద్యాశాఖ అధికారులు చిత్రాలను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాలకు చెందిన కె. పవన్ కుమార్ బృందం మొదటి బహుమతిగా రూ. 30 వేలు గెలుచుకుంది.



సావిత్రమ్మ ప్రభుత్వ కళాశాలకు చెందిన కె. శ్రీవల్లి బృందం రెండో బహుమతిగా రూ. 20 వేలు, అదే కళాశాలకు చెందిన ఆర్.ఎస్. షాలిని బృందం మూడో బహుమతిగా రూ. 10 వేలు అందుకున్నాయి. విజేతలకు కలెక్టర్ బహుమతి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలి దేవి, ఐసీడీఎస్ పీడీ శ్యామ్ సుగుణ కుమారి, పీవీకేఎన్ కళాశాల మహిళా విభాగం అధ్యాపకురాలు భ్రమరాంబ, సావిత్రమ్మ కళాశాల మహిళా విభాగం అధ్యాపకురాలు డాక్టర్ ఉషారాణి, డెమో ఇన్‌చార్జి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల జోలికొస్తే ఖబడ్దార్!



చిత్తూరు,అక్టోబర్ 12 (దరువు న్యూస్):అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుండా అధికారులతో ప్రలోభాలకు గురిచేస్తూ, భయపెట్టే ప్రయత్నాలు చేయడం దుర్మార్గమని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సుబ్బరావమ్మ హెచ్చరించారు. సోమవారం చిత్తూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో కె.పి. లలిత అధ్యక్షతన జరిగిన జిల్లా అంగన్వాడీల జనరల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో 42 రోజుల సమ్మె సందర్భంగా వేతనాల పెంపు, ఇతర సమస్యల పరిష్కారానికి రాతపూర్వక హామీలు ఇచ్చినా అమలు చేయలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్వాడీల వేతనాల పెంపుపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్నారు. అంగన్వాడీలకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, రోజురోజుకూ కొత్త యాప్‌లతో పెరుగుతున్న పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరిధర్ గుప్తా, అంగన్వాడీ యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ, కొన్ని ప్రాజెక్టుల్లో అంగన్వాడీలను అధికార పార్టీ సమావేశాలకు పంపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి చర్యలు చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ప్రాజెక్టుల స్థాయిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేయడం, వేతనాల పెంపుపై అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో జిల్లాలోని అంగన్వాడీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షకీలా, కోశాధికారి విజయ, జిల్లా నాయకులు సరళ, శోభ, షీలా, శైలజ, గోవిందమ్మ, కస్తూరి, మైథిలి, జమున,

కాణిపాకంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి సహకరించండి

చిత్తూరు,అక్టోబర్ 12(దరువు న్యూస్):ఐరాల మండలం కాణిపాకం పంచాయతీ పరిసర ప్రాంతంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహంతో పాటు అంబేద్కర్ భవనాన్ని నిర్మించేందుకు అవసరమైన స్థల కేటాయింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కాణిపాకం పరిసర దళిత నాయకులు జిల్లా కలెక్టర్ ను కోరారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎం. మహేష్ స్వేరో మాట్లాడుతూ, రెండేళ్ల క్రితం ఇదే అంశంపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయగా, ఆయన సానుకూలంగా స్పందించి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఐరాల మండల తహసీల్దార్‌లకు తగిన సూచనలు చేశారని తెలిపారు. సంబంధిత అధికారులు ప్రతిపాదిత స్థలాన్ని సర్వే చేసి ఫైల్ సిద్ధం చేసినప్పటికీ, తదుపరి చర్యలు చేపట్టకపోవడంతో సమస్య పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మరోసారి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత సాంఘిక సంక్షేమ శాఖ అధికారులను త్వరితగతిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన స్థల పరిశీలన పూర్తి చేసి ఫైల్ సిద్ధం చేయాలని ఆదేశించినట్లు మహేష్ స్వేరో తెలిపారు. అంబేద్కర్ భవన నిర్మాణానికి పూతలపట్టు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ దగ్గుమల్ల ప్రసాదరావు తమవంతు సహాయ సహకారాలు అందించేందుకు చొరవ చూపడం పట్ల దళిత నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్య పరిష్కారానికి స్పందించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకులు, మాజీ ఎంపీటీసీ డి. నటరాజ్, చిరంజీవి, నగేష్, రాజేంద్ర, జయచంద్ర, బొజ్జయ్య, మురగేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



పామిడిలో రేపు వైసీపీ ఐడీ కార్డుల పంపిణీ

ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్యే వైవీఆర్, జిల్లా అధ్యక్షులు అనంత


రామకృష్ణ నాయక్


ఈశ్వర్ రెడ్డి

పామిడి, అక్టోబర్ 12, దరువు న్యూస్ :
పామిడి మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు పార్టీ కార్యకర్తలకు గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని, పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో ఉన్న రహమత్ ఫంక్షన్ హాల్‌లో ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పామిడి పట్టణ కన్వీనర్ నాగూర్ ఈశ్వర్ రెడ్డి, మండల కన్వీనర్ రామకృష్ణ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.వెంకటరామిరెడ్డి, అనంతపురం జిల్లా వైసీపీ అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ నరేష్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతిరెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై కార్యకర్తలకు ఐడీ కార్డులు అందజేస్తారని వారు తెలియ జేశారు. పామిడి మండల, పట్టణ నాయకులు, వార్డు ఇన్‌చార్జులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని నాగూర్ ఈశ్వర్ రెడ్డి, రామకృష్ణ నాయక్ కోరారు.

ప్రజా అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు!

- ప్రతి వినతినీ బాధ్యతగా పరిశీలించాలి..
- గడువులోగా పరిష్కారం చూపాలి
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 296 అర్జీలు
- అధికారులకు జాయింట్ కలెక్టర్ ఆదేశాలు



పుట్టపర్తి, అక్టోబర్ 12, దరువు న్యూస్ :
ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించే ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా, వారికి సకాలంలో న్యాయం జరిగేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత మేరకు పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించాలని, తీసుకున్న చర్యలతో ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ వేదికకు మొత్తం 296 అర్జీలు అందగా, వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవడంతో పాటు పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్ పంపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ఎస్‌డీసీ విజయకుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమాచారాన్ని నిర్ణీత వ్యవధిలో అర్జీదారులకు అందించాలి : డీఆర్ఓ



అనంతపురం, అక్టోబర్ 12, దరువు న్యూస్ :
సమాచార హక్కు చట్టం కింద సమాచారాన్ని నిర్ణీత వ్యవధిలో అర్జీదారులకు అందించాలని డీఆర్ఓ ఏ.మలోల సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ఆర్టీఐ వారోత్సవాల్లో భాగంగా సమాచార హక్కు చట్టంకు సంబంధించి ఆయా శాఖల హెచ్ఓడిలకు, పిఐఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం కింద ఆయా శాఖల పిఐఓలు, ఏపిఐఓల వివరాలు ప్రదర్శించే నోటీస్ బోర్డులను ఆయా కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలన్నారు. 41బి వివరాలు తప్పనిసరిగా అప్డేట్ చేసుకోవాలన్నారు. సమాచార హక్కు చట్టం కింద అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, కలెక్టరేట్ పిఐఓ అలెగ్జాండర్, సూపరింటెండెంట్లు వసంతలత, రియాజుద్దీన్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి స్థానిక ఎన్నికల్లో ..

ప్రజలే తగిన బుద్ధి చెబుతారు

- వైసీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మురళీనాయక్



పామిడి, అక్టోబర్ 12, దరువు న్యూస్ :
ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మురళి నాయక్ విమర్శించారు. సోమవారం పామిడి పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని మురళినాయక్ ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మరోసారి ఎన్నికలు వచ్చినప్పుడు కొత్త హామీలతో ప్రజల ముందుకు రావాలని చూస్తోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తే ప్రజలు సహించరని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని మురళి నాయక్ పేర్కొన్నారు. రాష్ట్రంలో గిరిజనులు, పేదలు, రైతులు, మహిళలు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం వంటి కనీస సౌకర్యాలను మెరుగుపరచాలని కోరారు. గిరిజనుల సంక్షేమానికి సంబంధించిన పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో, ఇంకా ఎన్ని అమలు చేయాల్సి ఉందో ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే హామీలను కేవలం మాటలకే పరిమితం చేయకుండా ఆచరణలో అమలు చేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని, గిరిజనులు, పేదలు, రైతులు, మహిళలు, నిరుద్యోగుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని మురళి నాయక్ తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పు ద్వారా కూటమి ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని ఆయన తెలియజేశారు.

పార్వతి దేవి అలంకరణలో దర్శనమిచ్చిన

వాసవి కన్యాకాపరమేశ్వరి



అమరాపురం, అక్టోబర్ 12, దరువు న్యూస్ :
మండల కేంద్రమైన అమరాపురం పట్టణంలో వెలసిన ఆర్య వైశ్యుల ఆరాధ్య దైవమైన శ్రీ వాసవి కన్యాకాపరమేశ్వరి శ్రీ పార్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజైన సోమవారం శ్రీ వాసవి కన్యాకాపరమేశ్వరి మాతకు ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు దేవస్తానం ప్రధాన అర్చకులు హరీష్ బట్టర్ తెలిపారు. వివిధ భిషేకములు జరిపి మహా మంగళ హారతినిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం నిర్వాహకులు, సోదర సోదరి మణులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యార్థం షెడ్ నిర్మాణం





అనంతపురం, అక్టోబర్ 12, దరువు న్యూస్ :
అనంతపురం నగరంలోని హెచ్ఎల్సీ కాలువ ఒడ్డున ఉన్న బహుళ ఆలయాల ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం నిర్మించిన 2వేల చదరపు అడుగుల షెడ్డును సోమవారం ప్రారంభించి, ఆలయ అధికారులకు అప్పగించారు. కేజీటీ కిరణ్ గౌడ్ ట్రస్ట్ నిధులతో ఈ షెడ్‌ను నిర్మించారు. కేజీటీ వ్యవస్థాపక చైర్మన్ బొమ్మ గౌని కిరణ్ గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం షెడ్డును ఆలయ అధికారులకు అధికారికంగా అప్పగించారు. ఈ ప్రాంగణంలో చాముండేశ్వరి ఆలయం, పంచలింగేశ్వర ఆలయం, విఘ్నేశ్వర ఆలయం, నాగుల కట్ట, నవగ్రహ ఆలయం, సాయినాథ దేవాలయం ఉన్నాయి. పలు ఆలయాలను సందర్శించేందుకు వచ్చే భక్తులకు విశ్రాంతి తీసుకునేందుకు, ఎండా వానల నుంచి కొంత రక్షణ పొందేందుకు ఈ షెడ్ ఉపయోగపడుతుందన్నారు. భక్తుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ట్రస్ట్ నిధులతో ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. షెడ్డును ఆలయ అధికారులకు అప్పగించడంతో ఇకపై దాని నిర్వహణ, వినియోగం ఆలయ అధికారుల పర్యవేక్షణలో కొనసాగనుందని తెలియజేశారు.

వినతులపై వెంటనే స్పందన..
సహాయ ఉపకరణాలు అందించిన జేసీ
మానవత్వం చాటిన జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్
ఆరుగురికి ఉపకరణాల పంపిణీ

దివ్యాంగులకు తక్షణ ఊరట!



పుట్టపర్తి, అక్టోబర్ 12, దరువు న్యూస్ :
ప్రజా సమస్యల పరిష్కారంలో తక్షణ స్పందన బాధితులకు కొండంత భరోసానిస్తుంది. తమ అవసరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన దివ్యాంగులకు శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ వెంటనే అండగా నిలిచారు. పుట్టపర్తిలోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో దివ్యాంగులు తమకు అవసరమైన సహాయ ఉపకరణాల కోసం వినతులు సమర్పించారు. ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు కావాలని కోరడంతో స్పందించిన జాయింట్ కలెక్టర్ అక్కడికక్కడే వారికి ఉపకరణాలు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో నలుగురికి వినికిడి యంత్రాలు, ఇద్దరికి ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. వినికిడి యంత్రాలు పొందిన వారిలో గజ్జెల కుంటపల్లికి చెందిన నాగరాజు, కొత్తచెరువు మండలం కమ్మలపల్లెకు చెందిన పాములపర్తి నరసింహులు, కదిరికి చెందిన శంకర లక్ష్మి నరసమ్మ, కే.చంద్రశేఖర్ ఉన్నారు. ట్రైసైకిళ్లు పొందిన వారిలో కదిరికి చెందిన ఎస్.షకీల్, కొత్తచెరువుకు చెందిన పి.నరసింహులు ఉన్నారు. అవసరమైన సహాయ ఉపకరణాలు అందడంతో లబ్ధిదారులకు ఊరట లభించింది. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కేవలం వినతులు స్వీకరించడమే కాకుండా, అర్హులైన వారికి తక్షణ సాయం అందించడం ద్వారా అధికారులు ప్రజలకు మరింత చేరువ కావచ్చని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ప్రోగ్రామింగ్ అధికారి షఫియుల్లా, కార్యాలయ సహాయకులు గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

'జిల్లా పోలీస్ పిజిఆర్ఎస్'లో 130 అర్జీల స్వీకరణ

బాధితులకు చట్టపరిధిలో త్వరితగతిన న్యాయం చేయాలని
అధికారులకు ఆదేశం : జిల్లా ఎస్పీ పి.జగదీష్



అనంతపురం, అక్టోబర్ 12, దరువు న్యూస్ :
ప్రజాసమస్యల పరిష్కారానికే పోలీసు యంత్రాంగం తొలిప్రాధాన్యం ఇస్తుందని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 'పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టం' (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 130 అర్జీలు నమోదయ్యాయి. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదునూ చట్టపరిధిలో సమగ్రంగా విచారించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో బాధితులకు వేగంగా, పారదర్శకంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కుటుంబ తగాదాలు, తదితర పిటీషన్లకు సంబంధించిన అర్జీలపై వెంటనే స్పందించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతోపాటు అదనపు ఎస్పీ ఎం.నాగభూషణం, అనంతపురం అర్బన్ డీఎస్పీ కరుణాకర్ రావులు పిటీషన్లు స్వీకరించారు. ఇస్కాన్ సంస్థ ద్వారా పిజిఆర్ఎస్‌కు విచ్చేసిన పిటీషనర్లు, వారి సహాయకులకు ఉచితంగా భోజనం అందించారు.

ఐచర్ వాహన స్థాండ్ తొలగించకండి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన జేఏసీ సాకే హరి



అనంతపురం, అక్టోబర్ 12, దరువు న్యూస్ :
ప్రధాన జీవనోపాధిగా కొనసాగుతున్న ఐషర్ స్టాండ్ తొలగిస్తే తీవ్రంగా నష్టపోతామని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆవేదన చెందారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఓ.ఆనంద్‌ను ఐషర్, బొలెరో వాహనాల యజమానులు డ్రైవర్లతో కలిసి స్టాండ్ తొలగిస్తే మా బతుకుల బజార్‌లో పడతాయని స్టాండు యథావిధిగా కొనసాగేలా చూడాలని కోరుతూ సాకే హరి ఆధ్వర్యంలో నతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా బళ్లారి, కళ్యాణదుర్గం రోడ్డు మధ్యన ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద వాహనాలు స్టాండ్ ఏర్పాటు చేసుకుని బాడుగులు నడుపుకుంటూ 50 కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. స్మార్ట్ సిటీ పేరుతో స్టాండ్ తొలగిస్తున్నాము మీరు ఇక్కడి నుంచి ఖాళీ చేసి వెళ్లి పోవాలని ఉన్నఫలంగా హెచ్చరించడంతో యజమానులు,డ్రైవర్లు ఆందోళన చెందడం జరుగుతోందన్నారు. ఇప్పటికే ఎన్నో ఏళ్లుగా బాడుగులకు స్థావరంగా గుర్తింపు పొందిన స్టాండ్ తొలగిస్తే తాము చాలా ఇబ్బంది పడతామని అధికారులు ప్రజాప్రతినిధులు మా బాధలు అర్థం చేసుకొని యథావిధిగా ఇప్పటివరకు కొనసాగిన చోటనే ఐషర్, బొలెరో వాహనాలకు స్టాండ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద కొంత భాగాన్ని మాత్రమే స్టాండుకు కేటాయించాలని కలెక్టర్‌ను కోరగా అందుకు సానుకూలంగా స్పందించడం సంతోషమన్నారు. కార్యక్రమంలో వాహనాల యజమానులు రామాంజనేయులు, శ్రీనివాసులు, రాజు, హరినాథ్, రామయ్య, ధనుంజయ్య, రాధ కృష్ణ, షబ్బీర్, రవి నాయక్, కాశీమ్, గజరాజు, నరసింహ రెడ్డి, గజరాజుతోపాటు జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం చేయకుండా

సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేద్దాం



పుట్టపర్తి, అక్టోబర్ 12, దరువు న్యూస్ :
ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి చట్టబద్ధంగా బాధితులకు న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారం కోసం పోలీసు శాఖను ఆశ్రయించే ప్రజలకు నమ్మకం కలిగించేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి 62 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదులోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత పోలీసు అధికారులతో విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని సూచించారు. చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. భూతగాదాలు, కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భార్యాభర్తల మధ్య వివాదాలు తదితర సమస్యలపై బాధితులు తమ గోడును ఎస్పీకి విన్నవించారు. ఆయా ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ, సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా నిర్ణీత సమయంలో విచారణ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావడానికి ఎలాంటి సంకోచం చెందాల్సిన అవసరం లేదని ఎస్పీ తెలిపారు. న్యాయబద్ధమైన ప్రతి ఫిర్యాదుపై పోలీసు శాఖ బాధ్యతాయుతంగా స్పందిస్తుందని, బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అంకిత సురానా, సీఐలు బొజ్జప్ప, లక్ష్మీకాంత్ రెడ్డి, న్యాయ సలహాదారు సాయినాథ్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణానికి తాగు నీటి ఎద్దడి అనేది లేకుండా చేస్తా

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



గుంతకల్లు, అక్టోబర్ 12, దరువు న్యూస్ :
పట్టణానికి తాగునీటి ఎద్దడి అనేది లేకుండా చేస్తానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. సోమవారం సమ్మర్ స్టోరీస్ ట్యాంకులను ఆయన పరిశీలించారు. స్వచ్ఛమైన నీటిని అందించేందుకు ఫిల్టర్ ప్యాడ్స్ మార్చి వేశామని, స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గతంలో వారానికి ఒకసారి మంచినీటి సరఫరా చేసేవారు అయితే ఇప్పుడు మూడు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నామని ప్రజలకు శాశ్వతంగా నీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి, మున్సిపల్ ఇంజనీర్లు సిబ్బంది పాల్గొన్నారు.

Editor, Prblished and Owned by YENUMULA KULLAYAPPA, Published for D.No. 5-76, Bhanukota, Sri Satya Sai - 515621, Printed from Jai Sriram Publications D.No. 1-3-241, Rangaswamy nagar, Ananthapuramu 515001, EDITOR : YENUMULA KULLAYAPPA Mobile : 94940 39030.